క్లుప్తంగా

వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: పాఠశాలలో నమోదు చేయాల్సిన అన్ని వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని కెరమెరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఆగర్‌వాడ, ఇంద్రానగర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్, మిడ్‌లైన్ టెస్టు, వర్క్‌బుక్‌లు, తదితరాలను విధిగా నమోదు చేయాలన్నారు.

కేశవనాథ ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: కేశవనాథ ఆలయం వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణు గోపాల్ గుప్తా అధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు.

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వద్దకు ఎలా తీసుకెళ్లాలనే అంశంపై చర్చించినట్లు ఆమె తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

దహెగాం: మండల కేంద్రానికి చెందిన చప్పిడి విలాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఐకేపీలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న పడాల రాజ్‌కుమార్‌గౌడ్ అనే వ్యక్తి స్వయం సహాయక సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. విలాస్ అనే వ్యక్తి వచ్చి అకారణంగా రాజ్‌కుమార్‌పై దాడి చేయడంతో పాటు సభ్యులను అసభ్య పదజాలంతో దూషించాడు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి'

సిర్పూర్(టి): ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మెతుకు హేమలత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టభద్రుల హక్కులు, ఉద్యోగ కల్పనతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మోడల్ హౌస్ నిర్మాణాలు పూర్తి చేయాలి



నిర్మాణం పరిశీలిస్తున్న డీఈఈ వేణుగోపాల్

బెజ్జూర్: మోడల్ హౌస్ నిర్మాణాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈఈ ఆర్.వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ హౌస్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట బెజ్జూర్ గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సజీయోద్దీన్ ఉన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- వర్షాకాలంలో ఉరుస్తున్న వైనం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న సిబ్బంది
- వేసవిలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో సబ్‌స్టేషన్ కార్యాలయం

దహెగాం: ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. మండల కేంద్రంలో స్థానికంగా ఉన్న సబ్‌స్టేషన్, ఎమ్మార్సీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. కార్యాలయాలు శిథిలావస్థకు చేరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వర్షాకాలంలో ఉరుస్తున్న భవనాలు..

మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, ఎమ్మార్సీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో ఉరుస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. కార్యాలయంలో పుస్తకాలు, ఫైల్లు తడిసి పోతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మార్సీ కార్యాలయం వర్షాకాలం వచ్చిందంటే చాలు అందులో ఉన్న పుస్తకాలు, ఫైల్లు ఉరవని చోట ఉంచాల్సి వస్తుందంటున్నారు. పాఠశాలలు ప్రారంభ సమయంలో కొత్త పుస్తకాలు మండలానికి వస్తాయని వాటిని భద్రపరిచే గది ఉరుస్తుందని తెలిపారు. గదిలోని గోడలు పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారాయని పేర్కొంటున్నారు. సబ్‌స్టేషన్ భవనం సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని సిబ్బంది వాపోతున్నారు. సబ్‌స్టేషన్ సిబ్బంది ఉండే భవనం కూడా వర్షాకాలంలో ఉరుస్తుందని వాపోతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఎమ్మార్సీ కార్యాలయం

పట్టించుకోని అధికారులు..

ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి కోసం కోట్ల రుపాయలు ఖర్చు చేస్తున్నా శిథిలావస్థకు చేరిన భవనాలకు మాత్రం నిధులు మంజూరు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సైతం శిథిలావస్థకు చేరింది. అందులో విద్యార్థులు కూర్చోవడానికి జంకుతున్నారు. శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న అదనపు గదులలో విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. వచ్చే వేసవికాలంలో కొత్త భవనాలు నిర్మిస్తే వర్షాకాలంలో వచ్చే ఇబ్బందులు తప్పుతాయని పేర్కొంటున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామంలో క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా సోకడం వల్ల వస్తుందని, రెండు వారాలుగా దగ్గు, రాత్రిళ్లు చెమట పట్టి జ్వరం రావడం, బరువు తగ్గడం వంటి లక్షణాలను కలిగి ఉంటారన్నారు. అలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది గోదావరి, భగవాన్‌దాస్, ఉపాధ్యాయుడు శ్యాంరావు, గ్రామ పెద్ద మడావి భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్ మ్యూజియం సందర్శన



ఆభరణాలు తిలకిస్తున్న విద్యార్థులు



గుస్సాడీ ప్రతిమలను తిలకిస్తున్న చిన్నారులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో గల కుమురం భీం మ్యూజియంను బుధవారం ఆసిఫాబాద్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. కుమురం భీం, నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు, వివిధ రకాల ఆదివాసీల ఆభరణాలు, చిత్రమాలిక, ఆదివాసీల దేవతలు వాటి చరిత్రను తిలకించి సంబరపడ్డారు. కాగా భీం చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు భీం విగ్రహానికి నివాళులర్పించారు.

పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీవో

సాక్షి ఎఫెక్ట్..



శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. 'విద్యార్థులు ఆటలకు దూరం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉదయ్ కిరణ్ శిథిలావస్థలో ఉన్న భవనం కూల్చివేసి విద్యార్థులకు క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీవో ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించి క్రీడా స్థలం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి వైకుంఠం, ఉపాధ్యాయులు ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత గల మెటీరియల్ వినియోగించడంతో పాటు వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ మక్బూల్, గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం ఉన్నారు.

'పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెంచికల్‌పేట్: గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో అల్బర్ట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన సంవత్సర కాలం నుంచి పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదన్నారు. దీంతో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, ఇతర పనుల కోసం నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీల్లో నిధులు లేక విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారిందన్నారు.

వాంకిడి: గ్రామ పంచాయతీలో గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు, గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు వెంటనే విడుదల చేయాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పోషం, కార్యదర్శులు ప్రేమలత, స్రవంతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీలు, నల్లాల మరమ్మతులు ముందస్తుగానే చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నర్సరీలలో నాటిన ప్రతీ విత్తనం నాటుకునేలా చర్యలు తీసుకోవాలని, షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ పనులు ముగుస్తుండగా ఉపాధిహామీ పనులు మొదలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో జావిద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద 50 రోజులకు తగ్గకుండా కూలీలకు పని కల్పించాలని, సమగ్ర ఇంటింటి సర్వేలో రాని కుటుంబాల వివరాలను సేకరించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డెమో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు.

బస్సులో మరిచిపోయిన సర్టిఫికెట్లు అప్పగింత



సర్టిఫికెట్లు అప్పగిస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ఒరిజినల్ సర్టిఫికెట్లను డిపో మేనేజర్ విశ్వనాథ్ బుధవారం బాధితుడికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిర్యాణికి చెందిన ప్రయాణికుడు దేవిదాస్ ఆసిఫాబాద్ నుంచి తాండూర్‌కు ప్రయాణం చేసే క్రమంలో అతని భార్యకు సంబంధించిన ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను బస్సులో మర్చిపోయాడు. కండక్టర్ మనెమ్మ సర్టిఫికెట్లను గుర్తించి డిపోలో అందజేయగా బుధవారం బాధితుడికి డిపో మేనేజర్ అప్పగించారు.

ఘనంగా శివాజీ జయంతి

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- నివాళులర్పించిన నాయకులు



పెంచికల్‌పేట్: కొత్తగూడలో నిర్వహిస్తున్న శివాజీ జయంతి

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని శివాజీ మహరాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. శివాజీ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం తాలుకా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, మండల అధ్యక్షుడు డోకే మహేశ్, ఆరె సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: శివాజీ 398వ జయంతిని మండల కేంద్రంలోని శివాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూజలు చేశారు. నాయకులు సెడ్మకి తుకారాం, గిత్తే గణేశ్, పెండోర్ శ్రీనివాస్, వాడై సుభాష్, కోట్రంగే శ్రీనివాస్, ఉమేశ్ మండలి, పురి నరేశ్, ఆదే మున్నా, రామిల్ల మహేశ్, కైలాస్ తదితరులు ఉన్నారు.



కెరమెరిలో నివాళులర్పిస్తున్న యువకులు

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు రాళ్లగూడ తదితర గ్రామాల్లో బుధవారం శివాజీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తుమ్మిడె నారాయణ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాళ్లగూడ గ్రామంలోని శివాజీ విగ్రహం వద్ద ఆరె సంఘం నాయకులు మంగళహారతులతో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆరె సంఘం నాయకులు బక్కయ్య, బావాజీ, వెంకన్న, ప్రశాంత్, పత్రు, విలాస్, చౌదరి లక్ష్మణ్, పోశన్న, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: రాళ్లగూడ గ్రామంలో..

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): శివాజి మహరాజ్ జయంతిని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద సిర్పూర్(టి) మండల ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో శివాజీ జెండా ఆవిష్కరించారు. మండలంలోని ఆరెగూడ, హుడ్కిలి, నవేగాం, వేంపల్లి తదితర గ్రామాల్లో శివాజి జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజుర, అప్పపల్లి, బెల్గా, గుండి, గోవింద్‌పూర్ తోపాటు అన్ని గ్రామాల్లో శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఆరె సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షులు రాజయ్య, ప్రభాకర్, నాయకులు వినోద్, బాబాజీ, శ్రీను, అన్నరావు, దాదాజీ, పాలక్‌రావు, నగేశ్, పోచ్చయ్య పాల్గొన్నారు.

శివాజీ సేవలు అనిర్వచనీయం..

ఛత్రపతి శివాజీ సేవలు అనిర్వచనీయమైనవని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్టుపల్లి జయరాం అన్నారు. బుధవారం శివాజీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘ భవనం వద్ద శివాజీ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఎగురవేశారు. ఆరె సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భిక్కజీ, డివిజన్ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్, ప్రధాన కార్యదర్శి మారుతి, కురాట్కార్ రమేశ్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



దహెగాంలో శివాజీ విగ్రహం వద్ద..



సిర్పూర్(టి): జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో..



ఆసిఫాబాద్‌రూరల్: పూలమాల వేస్తున్న నాయకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయం పంచమ వార్షికోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అర్చకులు నరేశ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యపూజ, అభిషేకం, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్ వైరాగరే స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో వేణుగోపాల్ గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌటాల ప్రీమియర్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్వనాథ్

కౌటాల: మండల కేంద్రంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కౌటాల ప్రీమియర్ లీగ్ సీజన్1 క్రికెట్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మాజీ ఎంపీపీ విశ్వనాథ్ ఆవిష్కరించారు. మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 96400 04070, 93988 56646, 79891 07196 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. నాయకులు డబ్బా బాపు, తిరుపతి, రవీందర్, ప్రకాశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.